క్లుప్తంగా

కుష్ఠువ్యాధి నిర్ధారణపై శిక్షణ

ఇల్లెందురూరల్: రొంపేడు, కొమరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కుష్ఠు వ్యాధి నిర్ధారణపై సిబ్బందికి శనివారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత మాట్లాడుతూ... కుష్ఠు వ్యాధి సోకితే కనిపించే లక్షణాలపై అవగాహన కల్పించారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి 15వ వరకు అందరూ తమ క్లస్టర్ పరిధిలో పర్యటించి అనుమానితులను గుర్తించి పరీక్షలు చేయాలన్నారు.

అబ్బయ్యకు మాజీమంత్రి సత్యవతి నివాళి



అబ్బయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్

ఇల్లెందు/ఇల్లెందురూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ శనివారం రాత్రి పరామర్శించారు. హనుమంతులపాడు గ్రామంలో ఊకే అబ్బయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో అంగోత్ బిందు, చీమల నాగరత్నమ్మ, దాస్యం ప్రమోద్‌కుమార్, శీలం రమేష్, ఘాజీ, సుగుణయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఇల్లెందు: రాయపర్తిలో ఓ బ్యాంక్ దోపిడీ జరిగిన దృష్ట్యా ప్రతీ బ్యాంకు తప్పనిసరిగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఇల్లెందు డీఎస్పీ ఎస్.చంద్రభాను సూచించారు. శనివారం ఇల్లెందు పట్టణం, మండలంలోని 9 బ్యాంకు శాఖల మేనేజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. బ్యాంకుల లోపల, బయట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వాటిని పోలీస్ స్టేషన్‌లో కంట్రోల్ రూంకు కనెక్ట్ చేయాలని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా చేసుకోవాలన్నారు. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు నాగుల్ మీరా పటాన్, సూర్య, సందీప్ కుమార్ పాల్గొన్నారు.

జాబ్ మేళా

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. 16 మంది హాజరుకాగా, తొమ్మిది మంది ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో మూడు నెలల నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పించటానికి 18 నుంచి 29 సంవత్సరాలు నిండి జనరల్ డ్యూటీ, ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

గ్రామీణ వికాస కేంద్రం ఏర్పాటు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మల్లారం గ్రామపంచాయతీ మల్లారం గొత్తికోయగుంపులో శనివారం వాయిస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు ప్రేమ్‌దాస్ మాట్లాడుతూ.. గొత్తికోయగుంపులో వయోజన విద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా 11 నెలల కాలంలో వారిని న్యూస్‌పేపర్ చదవడం, సంతకం చేయడం, బస్సు బోర్డు, ఊర్ల పేర్లు చదవడం, రాయడం నేర్పి అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మోషే, రాంబాబు, స్థానికులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు



మాట్లాడుతున్న రుక్మాంగదర్ బండారి

కొత్తగూడెంఅర్బన్: మినీ వాటర్ స్కీం బోరు ఏర్పాటుతో నీటి సమస్య తీరుతుందని వార్డు కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి అన్నారు. శనివారం 35వ వార్డులో బోరు ఏర్పాటును ప్రారంభించి మాట్లాడారు. దీర్ఘకాలిక నీటి సమస్యను మినీ వాటర్ స్కీమ్‌తో తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు రూప బండారి, సమైక్య అధ్యక్షురాలు మునిగ సుజాత, వార్డు రిసోర్స్ పర్సన్ రాజ్యలక్ష్మి, అరిపినేని లక్ష్మి, నాయకులు రజినీకాంత్ బండారి, రాజు పాల్గొన్నారు.

గ్రామోత్సవ సంబురం

- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన కళాకారులు
- ఉర్సు వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా కళారూపాలు
- నేడు జులూస్ ఉత్సవం



గుస్సాడీ నృత్యం చేస్తున్న కళాకారులు (ఫైల్)

ఇల్లెందురూరల్: సర్వ జీవరాశుల మధ్య సమానత్వానికి ప్రతీగా నిలుస్తోన్న హజరత్ నాగుల్‌మీరా దర్గా ఉర్సు ఉత్సవాలను ఏటా కార్తీకమాసం చివరి అమావాస్య రోజున ఇల్లెందులో ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని ఖాసీం దుల్హా దర్గాహ్ నుంచి సత్యనారాయణపురం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోని హజరత్ నాగుల్‌మీరా దర్గాహ్ వరకు నాగుల్‌మీరా నిషానీలు, సందలత్‌తో ప్రదర్శన ఎంతో భక్తిభావంతో కొనసాగుతుంది. భక్తులు ఎంతో సంతోషంగా ఈ జులూస్‌లో పాల్గొంటారు. ఈ సంబురాలకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వాయిద్య, నృత్య కళాకారులు తరలివస్తారు.

ఆదివాసుల దేవత కళ గుస్సాడీ...

ఆదివాసీ గూడేలలో మాత్రమే కనిపించే గుస్సాడీ నృత్యం ఒక విశిష్టమైన కళ. ఇది రాజ్‌గోండ్ గిరిజనుల ప్రత్యేకం. వందల ఏళ్ల నుంచి ఈ ప్రాచీన దేవత కళ తరతరాలుగా కొనసాగుతోంది. ఈ నృత్యంలో (ఏడుం చల్) ఏడు రకాల నృత్యాలు ఉంటాయి. మొదటి నృత్యం ప్రారంభం షురూ (నూర్ చాల్)లో.. ముగ్గురు నలుగురు డప్పులను 'చుంచనకుం చుంచనకుం'అంటూ.. మంద్రగతిలో వాయిస్తుండగా గుస్సాడీలో రెండు మూడు వరుసలలో నిలబడి తమ చేతుల్లో గంగారాం సోట (సన్నటి రోకలి కర్ర)ను ముందుకు, ఆ పక్కకు, ఈ పక్కకు చూపుతూ ఎగురుకుంటూ ముందుకు వస్తారు. ఇలా సమూహాలుగా చేరి ఏడు రకాలుగా నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఈ సమూహాలను 'దండారి'సమూహాలు అంటారు. ఇందులోని చిన్నచిన్న సమూహాలను గుస్సాడీ అంటారు.

కేరళ వెలకలి...

పల్లె జానపద నృత్యాలలో కేరళ ప్రసిద్ధి చెందింది. శాస్త్రీయ నృత్యాలతో పోలిస్తే జానపద నృత్యాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. వెలకలి అనేది కేరళ ఆచార నృత్య రూపకం. ఇది ఒక ఆలయ కళ. పండుగ సమయాల్లో ఆలయ ప్రాంగణాల్లో ప్రదర్శించబడుతుంది. కేరళలో ప్రదర్శించబడే అత్యంత అద్భుతమైన అత్యంత శక్తివంతమైన నృత్యాలలో ఇది ఒకటి. ఈ కళారూపానికి అంత్యంత అంకిత భావం, నిరంతర సాధన అవసరం. ఈ వాయిద్యం వింటుంటే భక్తిభావం ఉప్పొంగుతుంది.

జానపద కళారూపం కోలాటం...

తెలుగు జానపద కళారూపాలలో కోలాటం ఒకటి. ఈ కళారూపం తెలుగు జానపదుల జీవితాలలో అంతగా పెనవేసుకుపోయింది. పెద్దల్ని, పిల్లల్ని అలరించే కళారూపం కోలాటం. కోల అంటే కర్రపుల్ల అని.. ఆట అంటే క్రీడ అని అర్థం. కోలాటం అంటే కర్రతో ఆడే ఆట. ఇందులో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది రెండు చేతులతోను కర్రముక్కలు పట్టుకొని పదం పాడుతూ గుండ్రంగా తిరుగుతూ ఆడతారు.

ఆకట్టుకునేలా ఖవ్వాలి...

ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని దర్గా ప్రాంగణంలో నాగపూర్‌కు చెందిన కళాకారుల చేత ఏర్పాటు చేసిన ఖవ్వాలి కార్యక్రమం భక్తులకు తన్మయత్వం కలిగిస్తుంది. ప్రేమ, భక్తిని పంచుతూ కళాకారుల గానకచేరి ఆకట్టుకుంటుంది. ఖవ్వాలి కళాకారులు వెంట తెచ్చుకున్న వాయిద్యాలపై వాయిస్తూ పాటలు పాడుతూ హోరెత్తిస్తారు.



సింగిరి వాయిద్యంతో కళాకారులు



కోలాటం ఆడుతున్న మహిళలు

ఘనంగా రైతు పండుగ



మాట్లాడుతున్న వీరహనుమంతరావు

చుంచుపల్లి: హౌసింగ్ బోర్డు కాలనీలోని కొత్తగూడెం సహకార సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు మండె వీరహనుమంతరావు ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం రైతు పండుగను ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ మాట్లాడతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ధాన్యం కొనుగోలులో క్వింటాకు రూ.500 బోనస్ అమలు చేస్తోందన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రం ధాన్యం దిగుబడిలో దేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు. సహకార సంఘాల ద్వారా 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ధాన్యం అమ్మిన రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పండ్ల సారయ్య, రైతులు జోనేబోయిన వెంకటేశ్వర్లు, గోసుక కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



వంటగదిని పరిశీలిస్తున్న సీహెచ్ఓ రామకృష్ణ, ఎస్ఓ పద్మజ

జూలూరుపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో శనివారం జూలూరుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సీహెచ్ఓ రామకృష్ణ విద్యార్థులకు వైద పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా విద్యార్థులకు సికిల్‌సెల్ వ్యాధి నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన కేజీబీవీలో వంట గది, నిత్యావసరాల స్టాక్ రూమ్‌ను తనిఖీ చేశారు. బియ్యం, సరుకులు, కూరగాయలను పరిశీలించారు. వంట పాత్రలు శుభ్రంగా ఉండాలని, బియ్యాన్ని మంచినీటితో కడిగి వండాలని వర్కర్లకు సూచించారు. పిల్లలకు వేడివేడి ఆహారం అందించాలన్నారు.తరగతి గదులు, టాయిలెట్స్, మురికి కాల్వలు శుభ్రంగా ఉంచాలని, దోమల వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ పద్మజ, పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కండి..



మాట్లాడుతున్న సతీష్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన, వేతనాల పెరుగుదలకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పీఎస్‌సీడబ్ల్యూ రీజియన్ అధ్యక్షుడు పెద్దబోయిన సతీష్ పిలుపునిచ్చారు. ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శనివారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బంగ్లోస్ ఏరియాలో నిర్వహించిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు.

మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలోని వివిధ విభాగాలలో సుమారు 20 ఏళ్ల నుంచి, దాదాపు 32 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరికి సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లను కార్మికులకు కేటాయించాలని, జీఓ నంబర్ 22ను గెజిట్ చేసి అమలు చేయాలని, కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో గుర్తింపు సంఘం యాజమాన్యానికి జరిగిన చర్చల్లో కాంట్రాక్ట్ కార్మికులపై చర్చించకపోవటం విచారకరమన్నారు. పెరుగుతున్న మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగటం లేదన్నారు. ఇప్పటికైనా 22 జీఓను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగమ్మ, శంకర్, సురేష్, రంజిత్, తార, భాగ్యలక్ష్మి, రోజా, శారద, మల్లేష్, ఉమేష్, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ అనుబంధ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వివేక్‌కు అందజేశారు. జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు మాట్లాడుతూ... వ్యవసాయ కార్మికులకు పనులు దొరకక, ఉపాధి లేక కుటుంబాలను పోషించ లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీలో పని కల్పించడంలో జరుగుతున్న లోపాల వలన వ్యవసాయ కార్మికులు అర్థాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంద రోజుల పనిలో కుటుంబంలో నలుగురు వ్యక్తులు ఉంటే ఒక వ్యక్తికి 25 రోజులు మాత్రమే పని లభిస్తోందన్నారు. అది కూడా రోజుకు రూ.50 – రూ.100 మాత్రమే కూలి పడుతోందని, అది కూడా అకౌంట్‌లో ఎప్పుడు జమ చేస్తారో కూడా తెలియదన్నారు. ఉపాధి హామీ విధివిధానాలను సవరించి ఒక వ్యక్తికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రమేష్, సీలం భాస్కర్, కుంజా రమేష్, భాస్కర్, శంకర్, శ్రీను, లక్ష్మి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలోని ఇల్లెందు, కోయగూడెం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. శనివారం 24 సింగరేణి రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో సాగిన ఈ మ్యాచ్‌ను సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి ప్రారంభించారు. మాట్లాడుతూ.. క్రీడాకారుల మధ్య స్నేహం అవసరం అన్నారు.

సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న భద్రునాయక్

పాల్వంచరూరల్: సేవాలాల్ సేన సంఘం సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన గుగులోతు బద్రునాయక్‌ను యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు సభావత్ శ్రీనునాయక్ నియమాకపత్రం అందజేశారు.

టీఎస్ యూటీఎఫ్ కమిటీ..



మాన్‌సింగ్, హరికుమార్

టేకులపల్లి: టీఎస్‌యూటీఎఫ్ టేకులపల్లి మండల 11వ మహాసభ శనివారం మండల కేంద్రంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు భూక్యా కిషోర్ సింగ్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాన్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా డి.హరికుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్ సింగ్ మాట్లాడుతూ... జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, కేవీ నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎం జాన్‌ఆనంద్‌కు సన్మానం



జాన్‌ఆనంద్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా జీఎంగా ఉద్యోగ విరమణ పొందిన జాన్‌ఆనంద్, సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్‌లను అధికారులు ఘనంగా సత్కరించారు. శనివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓఎస్‌డీ కృష్ణయ్య మాట్లాడుతూ.. 17 నెలలుగా ఇల్లెందు ఏరియా జీఎంగా బాధ్యతలు చేపట్టి అనేక కార్యక్రమాలు చేసి ఇక్కడి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల మన్ననలను పొందినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు గిరిధర్‌రావు, నరసింహారాజు, జీవీ మోహన్‌రావు, రామస్వామి, రవికుమార్, బాలాజీనాయుడు, ధనుంజరెడ్డి, మధుబాబు, దిలీప్ కుమార్, మహేష్, నాగేశ్వరరావు, యూనియన్ ప్రతినిధులు సారయ్య, రాజారాం, త్యాగరాజు, వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ శేషాంజన్ స్వామి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఎజెండాలోని నాలుగు అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చలు జరిపి ఆమోదం తెలిపారు. వాటిల్లో మున్సిపాలిటీలో 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించేందుకు అయ్యే ఖర్చును మున్సిపల్ సాధారణ నిధుల నుంచి బిల్లు చెల్లించేందుకు, సర్వే నంబర్ 143లోని 20 ఎకరాల 27 గుంటల ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కొరకు మున్సిపల్ పాలకవర్గానికి అభ్యంతరం లేదని తహసీల్దారుకు లేఖ పంపడం, ప్రతిగమైదాన్‌లో లైటింగ్ ఏర్పాటుకు నిధుల మంజూరు, పట్టణంలోని పార్కులలో మొక్కల సంరక్షణకు, పార్కుల క్లినింగ్‌కు ఎంగేజ్ చేసుకున్న వాచర్లకు వేతనాలు చెల్లింపులపై చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కథల సంపుటి ఆవిష్కరణ



రంగనాథ్‌ను సత్కరిస్తున్న హరిప్రియ, దిండిగల తదితరులు

ఇల్లెందు: సింగరేణి జేకే ఓసీ అసిస్టెంట్ సూపరింటెండెంట్, సబర్మతీ స్కూల్ మాజీ కరస్పాండెంట్, టీబీజీకేఎస్ నేత, ఇల్లెందు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఎస్.రంగనాథ్ కలం నుంచి వెలువడిన 'ప్రాణం తీసిన పైసలు' కథల సంపుటి పరిచయ కార్యక్రమం జేకే సీఈఆర్ క్లబ్‌లో శనివారం జరిగింది. 32 ఏళ్ల పాటు సింగరేణిలో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా, కథల సంపుటి ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆయనను సింగరేణి, టీబీజీకేఎస్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు ఘనంగా సత్కరించారు. రాజకీయ నేతలు దిండిగాల రాజేందర్, బాస శ్రీనివాస్, మడత వెంకట్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ హాజరయ్యారు.

పీహెచ్‌సీకి బోరు, ఫ్రిడ్జ్ వితరణ



సులానగర్‌లో బోరును ప్రారంభిస్తున్న దృశ్యం

టేకులపల్లి: హైదరాబాద్‌లోని గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు 'స్ట్రీట్ కాస్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో పాటు ఖాళీ సమయాలలో పార్ట్ టైం ఉద్యోగాలు చేసి సంపాదించిన నగదుతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోరు వేయించి మోటారు ఏర్పాటు చేశారు. అలాగే, సురక్షిత తాగు నీటి కోసం వాటర్ ప్యూరిఫైయర్, ఫ్రిడ్జ్‌ను శనివారం వితరణగా అందజేశారు. గత 15ఏళ్లుగా మారుమూల ప్రాంతాల పాఠశాలల్లో నీటి వసతి కల్పించడం, మరుగుదొడ్లు నిర్మించడం, పిల్లలకు పుస్తకాలు పంపిణీ, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, ప్రజల్లో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారి కందుల దినేష్, స్ట్రీట్ కాస్ ప్రెసిడెంట్ భవ్యశ్రీతో పాటు బల్లెం దేదీప్య రాజేష్, నితీష్, మనోజ్, మోక్షిత్, కల్పన, హన్సిక, బల్లెం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆదేశాలు సరికాదు..

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ కార్యక్రమం పేరుతో ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించడం సరికాదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలలో 'పునరుత్పాదక ఇంధన వనరులు' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించాలని ఆదేశించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే పాఠశాలలు, మండలస్థాయిలో పోటీలు నిర్వహించి జిల్లాకు ఎంపిక చేసినా మళ్లీ పోటీలు నిర్వహణకు నిర్ణయించడం గర్హనీయమని, ఇకనైనా అధికారులు రద్దు చేయాలని కోరారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న నస్రా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి హెడ్డాఫీసు సెంటర్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు జమాతే ఇస్లామీ హింద్ రామవరం శాఖ అధ్యక్షురాలు నస్రా శనివారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. వృద్ధులను గౌరవించాలని, ఉన్న దాంట్లో ఇతరులకు సాయం చేయాలన్నారు. ఆయువు, ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం ముసలి వారి సేవలో ఉన్నాయని ప్రవక్త ముహమ్మద్ తెలిపారని గుర్తుచేశారు. అలాంటి వృద్ధులకు సేవ చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. ధనవంతులు ఇలాంటి వృద్ధాశ్రాయలకు చేయుతను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పర్వీన్ సుల్తానా, షాహెదా, షమీం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తగూడెంలో ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న పేదలకు మెగా ఈవెంట్స్ ఆర్గనైజర్ గండికోట కిరణ్‌కుమార్ దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. ఆర్టీసి బస్టాండ్, రైల్వే స్టేషన్ ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న వారికి 150 దుప్పట్లు, 50 స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చదలవాడ సూరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం



సింగరేణి(కొత్తగూడెం): ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. గురుకుల, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురవుతున్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శనివారం విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించడంతో మూతపడ్డాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: సింగరేణి హైస్కూల్ వద్ద మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు



ఇల్లెందు: గిరిజన ఆశ్రమ పాఠశాలలో..



జూలూరుపాడు: విద్యా సంస్థలను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



పాల్వంచ: మాట్లాడుతున్న నాయకులు